క్లుప్తంగా

జాతీయ రహదారిపై ప్రమాదం

తాడేపల్లిరూరల్: జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని కారు ఢీకొట్టింది. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం, వీరాపురానికి చెందిన సత్య ప్రకాష్ మంగళగిరిలోని డీజీపీ కార్యాలయం సమీపంలో ఉన్న ఓ హోటల్‌లో కెప్టెన్‌గా పనిచేస్తున్నాడు. రాధారంగా నగర్‌లో నివాస ముండే అతను ఇంటి నుంచి రోడ్డుమీదకు వచ్చి రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. సత్య ప్రకాష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. తనను వైట్ ఫార్చునర్ కారు ఢీకొట్టిందని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భద్రతా సిబ్బంది ఆసుపత్రిలో చేర్పించారని సత్యప్రకాష్ తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి దొంతిరెడ్డి పరామర్శ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ బ్రహ్మానందపురం హనుమంతరావు కాలనీలోని వైఎస్సార్ సీపీ నాయకుడు మండ్రు మనోహర్‌ను శుక్రవారం ఆ పార్టీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పరామర్శించారు. మనోహర్ ఇటీవల అగ్నిప్రమాదంలో గాయపడ్డాడు. దొంతిరెడ్డి అతనిని పరామర్శించి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. స్థానిక నాయకులు పుష్పరాజ్, ఉండ్రు కల్యాణ్ తదితరులు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్లలో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



మంగళగిరి టౌన్: గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మంగళగిరి పట్టణ, రూరల్, తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ల రికార్డుల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం సతీష్‌కుమార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల పరిస్థితులను సీఐ, ఎస్ఐలను అడిగి తెలుసుకన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు గట్టిగా పనిచేయాలన్నారు. ఆయా పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసులను త్వరితగతిన లోక్ అదాలత్‌లో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవికుమార్, నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ, మంగళగిరి పట్టణ సీఐ వినోద్‌కుమార్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణ

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు అన్నపూర్ణాదేవి విశ్వేశ్వరదేవి ఆలయంలో శుక్రవారం అన్నప్రసాద వితరణ చేశారు. గురువారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీ ఎంబీడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావులు హాజరై అన్నప్రసాదాన్ని ప్రారంభించారు.

సైన్స్ ఎగ్జిబిషన్లతో విజ్ఞానం

మేడికొండూరు: విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్‌లు ఎంతగానో దోహదపడతాయని పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్ డైరెక్టర్ కోనూరి జయ కుమార్ అన్నారు. మండలంలోని పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్లో రెండు రోజుల సైన్స్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఎగ్జిబిషన్స్‌లో విద్యార్థులు తయారు చేసిన 200 నమూనాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఎగ్జిబిషన్ ఇంచార్జిలు విజయలక్ష్మి, జై భూన్ పాల్గొన్నారు.

సైన్సుపై అవగాహన అవసరం

ఫిరంగిపురం: విద్యార్థులకు సైన్సు విజ్ఞానంపై అవగాహన అవసరమని సిస్టర్ కొమ్మారెడ్డి నిర్మలామేరి అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో జాతీయ సైన్సు దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. హెచ్ఎం సిస్టర్ నిర్మలామేరి సర్ సీవీరామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టు నమూనాలు ప్రదర్శించారు. సైంటిస్టులు వారిపేర్లు, వారి చిత్రపటాలు, రూపొందించిన వస్తువులు విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు మాదాను అనిల్ తేజ, ఎలిజబెత్ రాణి, విక్టోరియా, షాహిదా, అనసూయ, సుజాత పాల్గొన్నారు. వేమవరం ఎంపీపీ పాఠశాలలో జాతీయ సైన్సు దినోత్సవం నిర్వహించారు. భారతీయ శాస్త్రవేత్తల చిత్రప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. హెచ్ఎం దీవి, కమల్‌మోహన్, అభివృద్ధి కమిటీ చైర్మన్ జెట్టి సుబ్బయ్య, ఉపాధ్యాయుడు రవికుమార్ పాల్గొన్నారు.

ప్రాజెక్ట్‌కు రాష్ట్రస్థాయి గుర్తింపు

మంగళగిరి టౌన్: ఏటా నిర్వహించే సైన్స్ ప్రాజెక్ట్‌లో భాగంగా మంగళగిరి విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్‌కు రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి లభించినట్లు శ్రీచైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ కె.వాసు తెలిపారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం సైన్స్ డే నిర్వహించారు. నేషనల్ ఏరో నాటికల్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) నిర్వహించిన ప్రాజెక్ట్‌లో పాల్గొన్న 9వ తరగతి విద్యార్థి మోక్షిత మాధురి, 8వ తరగతి విద్యార్థులు శశిగాయత్రి, జ్యోతికశ్రీ, 7వ తరగతి విద్యార్థి వెంకట నాగ సాత్విక్ కుర్మాలు తయారు చేసిన ''గ్రోయింగ్ పొటాటో ఇన్ ది స్పేస్'' అనే ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి లభించినట్లు పేర్కొన్నారు. నాసా పంపిన సర్టిఫికేట్లు, మెడల్స్‌ను విద్యార్థులకు బహూకరించారు. మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, చైతన్య పాఠశాల డీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మంత్రి రామానాయుడిని సత్కరిస్తున్న యాజమాన్యం

ప్రాక్టికల్ నాలెడ్జ్‌తోనే విద్యార్థుల్లో పురోగతి

మంగళగిరి టౌన్: ప్రాక్టికల్ నాలెడ్జ్‌తోనే విద్యార్థులు పురోగతిని సాధిస్తారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రాజెక్టులను చూసి, వారి ప్రతిభను అభినందించారు. అనంతరం మంత్రి రామానాయుడుని స్కూల్ యాజమాన్యం శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కరస్పాండెంట్ కేవీ ఫ్రాన్సిస్, ప్రిన్సిపల్ తబన ఫ్రాన్సిస్, వైస్ ప్రిన్సిపల్ షేక్ రజియా సుల్తానా పాల్గొన్నారు.



మేడికొండూరు: ఎన్నారై కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు

సీవీ రామన్ గర్వకారణం

దుగ్గిరాల: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని దుగ్గిరాల జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.శోభాదేవి సీవీ రామన్ భారతీయులందరికి గర్వకారణంగా నిలిచారన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

తాడేపల్లిరూరల్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట శ్రీ చైతన్య స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సివిల్ కోర్టు న్యాయవాది ఎన్.ఎం. వెంకయ్య విచ్చేసి, ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈజీఎం మురళీకృష్ణ, వి.వి. రామారావు, కో-ఆర్డినేటర్ చక్రధర్ ప్రసాద్, ప్రిన్సిపల్ సుధీర్ ప్రసాద్, బి.శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

ఎన్నారైలో సైన్స్ దినోత్సవం

మేడికొండూరు: మండల పరిధిలోని ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ కోట శ్రీనివాసు అధ్యక్షత వహించారు. వివిధ శాఖ అధికారులు రాము, కేఎస్ఆర్ నాగేశ్వరావు, ఏవో సీతారామయ్య, కోటేశ్వరావు, సౌజన్య, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ రాణి జయకుమార్



సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్ఎం సిస్టర్ కొమ్మారెడ్డి నిర్మలమేరి



నమూనాలను పరిశీలిస్తున్న న్యాయవాది వెంకయ్య

ఏసీసీ కార్మికులకు మద్దతు తెలిపిన దొంతిరెడ్డి



కార్మికులతో మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ కార్మికులు 87 రోజుల నుంచి చేస్తున్న దీక్షకు మరోసారి శుక్రవారం వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు 31 సంవత్సరాల నుంచి తమకు రావాల్సిన బకాయిల గురించి పోరాటం చేస్తున్నారని, కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చినా ఇప్పటి వరకు ఎటువంటి చెల్లింపులు జరగలేదన్నారు. వైఎస్సార్ సీపీ నుంచి కార్మికులకు పూర్తి మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుష్పరాజు, మంగళగిరి నియోజకవర్గ ఆర్టీఐ విభాగ అధ్యక్షుడు ఉండ్రు కల్యాణ్ కుమార్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

తాడేపల్లిరూరల్: రేవేంద్రపాడు జెడ్పీ ఉన్న పాఠశాలలో వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ, ఎయిమ్స్ ఆసుపత్రి వైద్యుల బృందం ఆధ్వర్యంలో సీపీఆర్ ప్రథమ చికిత్సపై విద్యార్థులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎయిమ్స్ హాస్పిటల్ డాక్టర్ రాకేష్ సీపీఆర్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించే పద్ధతులపై అవగాహన కల్పించారు. పప్పెట్ ద్వారా విద్యార్థులతో ప్రాక్టికల్స్ చేయించారు. సాక్ డైరెక్టర్ సాయి విజయ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీవీ సత్యనారాయణ, శివకృష్ణ పాల్గొన్నారు.

పక్షపాత ధోరణి చూపుతున్న కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



మాట్లాడుతున్న వనమాబాల వజ్రబాబు

ఫిరంగిపురం: కూటమి ప్రభుత్వం పక్షపాతధోరణి అవలంబిస్తోందని తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమాబాల వజ్రబాబు అన్నారు. మండలంలోని ముసగపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులపై అణిచివేత ధోరణితో వ్యవహరిస్తున్నారని దీనిని సహించేది లేదన్నారు. నాయకులు, కార్యకర్తలకు తాను అండగా నిలుస్తానన్నారు. ప్రతి గ్రామంలో గతంలో జరిగిన తప్పిదాలు, విభేదాలను పక్కన పెట్టి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే వాటిని తన దృష్టికి తీసుకువస్తే, త్వరిత గతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తి రేణమ్మ, ఎంపీపీ షేక్.షహేలానర్గీస్, షేక్, సలీం, సయ్యద్ హబీబుల్లా, గోవిందరావు, సయ్యద్ జిలానీ, జి. శివనాగమల్లేశ్వరి, చౌడయ్య, ఖాసిం షాహిద్, పి.చిన్న, జి, కోటేశ్వరరావు, షేక్.కె, మీరావలి, సీహెచ్, రామమోహన్‌రెడ్డి, షేక్, సత్తార్, టి.వెంకటేశ్వర్లు, షేక్.సుబానీ, ఎస్.మక్దూమ్ షరీఫ్, ఎం.వెంకటరెడ్డి, షేక్.సద్దర్, జి.బాజీ, షేక్, హుస్సేన్ బీ, మస్తాన్‌వలి, నాగరాజు, రామారావు, చిన్నసుబాని, జి.బాబు, షేక్. గౌస్, శివాంజినేయులు, షేక్. మీరావలి పాల్గొన్నారు.

బాలస్వామి సేవలు ఎనలేనివి

ఫిరంగిపురం: బిల్ కలెక్టర్ బాలస్వామి సేవలు ఎనలేనివని ఎంపీడీవో వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం బిల్ కలెక్టర్ బాలస్వామి పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాలస్వామి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా పనులు చేసారని చెప్పారు. అనంతరం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేడాబాబు, ఈవో ఏకే బాబు, నాయకులు పాల్గొన్నారు.



185 మందికి వైద్య పరీక్షలు



ఫిరంగిపురం: వేములూరిపాడు గ్రామంలో శుక్రవారం ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 185 మందికి వైద్యురాలు శ్వేత పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా వేసవిలో గర్భిణులు, చిన్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్ఎం ఆంథోనిరాణి, బాబురావు, ఆశ కార్యకర్తలు సుజాత, పద్మ, శాంతరాణి, శాంతకుమారి, జోజమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటుకు వ్యాక్సినేషన్

ఫిరంగిపురం: పలు గ్రామాల్లోని పశువులకు శనివారం నుంచి గాలికుంటు నివారణ టీకా వేయనున్నట్లు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆవులు, గేదెలకు ఆయా గ్రామాల్లోని పశువైద్య సిబ్బంది టీకా వేస్తారని పేర్కొన్నారు. పశువులు ఉన్న రైతులు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

సౌర విద్యుత్‌పై అవగాహన



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం పెదవడ్లపూడిలో పీఎం సూర్యఘర్ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వర్శిటీ విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు రాయితీలు కల్పిస్తున్నాయని చెప్పారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం గురించి గ్రామస్తులకు వలంటీర్లు అవగాహన కల్పించారు. ఈఈఈ అధ్యాపకురాలు డాక్టర్ కె.శారద, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్, సమన్వయ కర్తగా పి. సురేష్ పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మంగళగిరి టౌన్: చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతలకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మంగళగిరి రాష్ట్ర చేనేత జౌళి శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జౌళిశాఖ కమిషనర్ రేఖారాణిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత ప్రధాన వృత్తిగా ప్రసిద్ధి చెందిన చేనేత పరిశ్రమ కార్పొరేట్ విధానం వల్ల సంక్షోభంలో కూరుకుపోయిందని వాపోయారు. 200 యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తామని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం జీవో ఇంత వరకు విడుదల చేయలేదన్నారు. నేతన్న నేస్తం మగ్గం చేస్తున్న ప్రతి చేనేత కార్మికుడికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివదుర్గారావు, ఉపాధ్యక్షులు రామారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, వీరభద్రం, శ్రీలక్ష్మి, కె.లక్ష్మి, సత్యనారాయణ పాల్గొన్నారు.



కమిషనర్ రేఖారాణికి వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

గంజాయి, మద్యం మత్తులో యువకుల హల్‌చల్

- బెదిరించి డబ్బులు వసూలు
- ఫోన్ పే ద్వారా బలవంతంగా రూ. 2 వేలు బదిలీ
- అడ్డుకుని చితకబాదిన స్థానికులు
- పోలీసులు వచ్చేసరికి పరారీ

తాడేపల్లి రూరల్: ఉండవల్లి– అమరావతి రోడ్డులో మద్యం, గంజాయి మత్తులో ఉన్న యువకులు దేవుని మాన్యం గ్రౌండ్‌లో ఉన్న మరో ముగ్గురు యువకులపై దౌర్జన్యం చేసి వారి వద్ద నుంచి నగదు దోచుకున్నారు. ఈ సంఘటనపై శుక్రవారం తాడేపల్లి పోలీసులు విచారణ చేపట్టారు. సేకరించిన వివరాల ప్రకారం.. ఉండవల్లికి చెందిన ఓ యువకుడితో పాటు మరో ఇద్దరు మద్యం తాగి ఉండవల్లి దేవుని మాన్యంలో మాట్లాకుంటున్నారు. ఈ సమయంలో ఆటోలో మరో ముగ్గురు అక్కడకు వచ్చారు. తమ దగ్గర ఉన్న బ్లేడ్ చూపించి ఓ యువకుడిని '' నువ్వు నాకు తెలుసు.. డబ్బులు ఇస్తావా.. లేదా ?'' అంటూ బెదిరించారు. భయపడిన అతడు జేబులో ఉన్న ఐదు వేలను ఇచ్చివేశాడు. అంతటితో ఆగకుండా ఫోన్‌పే ద్వారా 2 వేల రూపాయలు చేయించుకున్నారు. వచ్చిన ఆటోలోనే పారిపోతుండగా, ఉండవల్లి అమరావతి రోడ్డులో గుంటూరు చానల్ వద్ద వారిని ఉండవల్లికి చెందిన యువకుడితో పాటు మరికొంతమంది చితకబాది పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇదే సమయంలో వారి ఆటోలో గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు కూడా గుర్తించారు. దీంతో ముగ్గురూ అసభ్యంగా మాట్లాడారు. ''మీ సంగతి తేలుస్తాం .. మీరు ఎక్కడ ఉన్నా వదిలపెట్టం'' అంటూ అక్కడి నుంచి పరారయ్యారు. జరిగిన ఈ సంఘటనపై ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. సీఐ కల్యాణ్ రాజు మాట్లాడుతూ సంఘటన జరిగిన మాట వాస్తవమేనని, వారి వద్ద గంజాయి ఉన్నట్లు సమాచారం వచ్చిందని తెలిపారు. ఆటో నంబర్ ఆధారంగా విచారణ చేపడుతున్నట్లు చెప్పారు.



గుర్తు తెలియని వ్యక్తులు వదిలివెళ్లిన ఆటో నగదు లాక్కున్న వ్యక్తి



విశ్వ వ్యాప్తంగా తాగునీటి లభ్యత తగ్గుతోంది

ఎస్ఆర్ఎంలో నీటి అవసరాలపై ముగిసిన వర్క్ షాప్

మంగళగిరి: విశ్వ వ్యాప్తంగా తాగునీటి లభ్యత తగ్గుతోందని, భవిష్యత్తు తరాలకు నీటి విలువను తెలియజేయాలని నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్ ప్రొఫెసర్ ఆచార్య రాజశేఖర్ బాలసుబ్రమణియన్ పేర్కొన్నారు. మండలంలోని నీరుకొండలో ఉన్న ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో శుక్రవారం నీటి అవసరాల సవాళ్లు, పరిష్కారాలపై రెండు రోజుల వర్క్‌షాప్ జరిగింది. సదస్సుకు హాజరైన శాస్త్రవేత్తలు మాట్లాడుతూ జీవరాశి మనుగడకు ప్రాణాధారమైన తాగునీటిని పొదుపుగా వాడుకోవడం అత్యంత ఆవశ్యకమని చెప్పారు. ఈ విషయాన్ని దేశీయంగా విస్తత ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నీటిపై పరిశోధనలు సాగిస్తున్న ప్రొఫెసర్ రాజశేఖర్ వాతావరనంలో మార్పులు, నీటి కాలుష్యం, ఇతరత్రా కారణాల వల్ల తాగునీటి వనరులు తగ్గిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న తాగునీటి అవసరాలకు అనుగుణంగా నీటి వనరులు అభివృద్ధికి కృషి జరగాలన్నారు. వీసీ డాక్టర్ మనోజ్ అరోరా, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్, డీన్‌లు డాక్టర్ సీవీ టామి, డాక్టర్ రంజిత్ థాపా, నిర్వాహకులు డాక్టర్ రంగ భాష్యం, డాక్టర్ కౌశల్ దాస్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ ఆచార్య రాజశేఖర్ బాలసుబ్రమణియన్

ఘనంగా టైలర్స్ డే



టైలర్స్ డే వేడుకల్లో దర్జీలు

దుగ్గిరాల: టైలర్స్ దినోత్సవాన్ని దుగ్గిరాలలో టైలర్స్ శుక్రవారం నిర్వహించారు. మండల టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్‌కి నివాళులర్పించారు. టైలర్స్ సమస్యల పరిష్కారానికి సమష్టిగా పోరాడాలన్నారు. పాములు, బాషా, కుమార్, శివ పాల్గొన్నారు.

మంగళగిరిలో టైలర్స్ డే వేడుకలు

మంగళగిరి టౌన్: అమరావతి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగర పరిధిలోని ఈద్గా షాదీ మహల్‌లో టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుట్టు మిషన్ కనిపెట్టిన విలియమ్స్ హోవే చిత్రపటానికి అసోసియేషన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ టైలర్స్ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. టైలర్స్ కార్పొరేషన్, 50 ఏళ్ల నిండిన టైలర్లకు పెన్షన్ ఇచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వం టైలర్లను ఆదుకునే అవసరం ఎంతైనా ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, సీపీఐ నాయకులు కంచర్ల కాశయ్య, సీపీఎం నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, టైలర్స్ అసోసియేషన్ కార్యదర్శి జంజనం సాంబశివరావు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.